ప్రతి ఇంటికీ తాగునీరు..

- రూ. 37.5 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పథకం పనులు
- 80 శాతం పనులు పూర్తి
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు


పూసపాటిరేగ బూడివీధిలో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి

పూసపాటిరేగ: ఒకప్పుడు బిందెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితులుండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారాయి. ఇంటి వద్దే తాగునీరు పట్టుకునే స్థాయికి ప్రజలు చేరుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల ప్రజలు తాగునీటికి నానా అవస్థలు పడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం.. పాలకులు తాగునీటి సమస్యలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోతున్నాయి. తాజాగా జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు చాలావరకు పూర్తయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జల్‌జీవన్ పథకం నిర్వహిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం మండలాల పరిధిలోని 285 గ్రామాల్లో 62,029 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు రూ. 37.5 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటివరకు 80 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఎంతో కాలంగా నీటికోసం పడుతున్న కష్టాలకు చెక్ పడుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పూసపాటిరేగ మండలంలోని రెల్లివలస, కుమిలి, బొర్రవానిపాలెం, మలకాం, ఎల్‌డీ తోట, బూర్లెవాని కల్లాలు, బరిణికాం, మత్స్యవానిపాలెం, పేరాపురం గొల్లపేట, చినబత్తివలస గ్రామాలలో ఇప్పటికే ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. మిగిలిన మండలాల్లో కూడా పనులు చకాచకా జరగుతున్నాయి. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవతో తాగునీటి కష్టాలు తీరుతున్నాయని నియోజకవర్గ ప్రజలు చెబుతున్నారు.

కుళాయిల ఏర్పాటుకు మంజూరు చేసిన నిధులు

మండలం	గ్రామాలు	గృహాలు	నిధులు (రూ.కోట్లల్లో)
పూసపాటిరేగ	73	18,165	రూ.10.5
నెల్లిమర్ల	51	14,676	8.5
డెంకాడ	76	14,113	8
భోగాపురం	85	15,075	రూ.10.5

నీటి కష్టాలు తీరినట్లే..

ఎంతో కాలంగా ఉన్న తాగునీటి కష్టాలు తీరాయి. తాగునీటి కుళాయిల కోసం ప్రజలు ఎదురుచూశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇంటింటికీ కుళాయిలు వేశాం. ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
– టి. సీతారాం, సర్పంచ్ పూసపాటిరేగ

80 శాతం పూర్తయ్యాయి..



నెల్లిమర్ల నియోజకవర్గంలో 285 హ్యాబిటేషన్లలో సుమారు 37.5 కోట్ల రూపాయలతో ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నాం. ప్రస్తుతానికి 80 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. మరి కొద్దిరోజులలో పనులు పూర్తి చేస్తాం. ప్రజల తాగునీటి కష్టాలు తీరనున్నాయి.
– ప్రవీణ్‌శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పూసపాటిరేగ

నీరే జీవనాధారం..

డెంకాడ: నీరు జీవనాధారమని.. అటువంటి నీటిని వృథా చేయరాదని రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ బీఎస్ వెంకటరెడ్డి అన్నారు. మోపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పొదుపుపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: పేకాటాడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సాగర్‌బాబు, సిబ్బంది శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 19,110 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం వారిని రూరల్ పోలీసులకు అప్పగించారు.

ఐదుగురు వలంటీర్ల తొలగింపు

విజయనగరం అర్బన్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి, రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొన్న ఐదుగురు వలంటీర్లపై వేటు పడింది. గరివిడి మండలం చుక్కవలసకు చెందిన దబ్బాక వెంకటలక్ష్మి, విజయనగరం పట్టణం అద్దేపల్లివారి వీధికి చెందిన గురజాపు చంద్రశేఖర్, గంగి మురళి, కుప్ప గురుమూర్తి, బసవ రాజును విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల కోడ్‌పై అవగాహన పెంచుకోవాలి


చిన బూరాడపేటలో పర్యటిస్తున్న ఎంపీడీఓ రామారావు, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: ఎన్నికల కోడ్‌పై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ గిడుతూరి రామారావు సూచించారు. మండలంలోని చిన బూరాడపేట, పెద బూరాడపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించి ఎంసీసీ అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌పై సిబ్బంది పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలతో దురుసుగా వ్యవహరించకూడదని సూచించారు. ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


నగర పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

పక్కాగా ఎన్నికల కోడ్..

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు పరిపాలనా కార్యదర్శులు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, బస్టాప్, రైల్వేస్టేషన్, రైల్వే బ్రిడ్జ్, మెయిన్ రోడ్డు, బస్సులు, ఎలక్ట్రికల్ పోల్స్ , ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, జెండాలు తొలగించాలని ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

నెల్లిమర్ల: విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎంఈఓ -2 ఈపు విజయ్‌కుమార్ అన్నారు. ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ 11వ వార్డులో గల ఆదిత్య పబ్లిక్ స్కూల్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ అటెండెన్స్, అడ్మిషన్ రికార్డులు, ఉపాధ్యాయుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల్ల విద్యార్థులను అడ్మిట్ చేసుకునేటప్పుడు బర్త్ సర్టిఫికెట్, విద్యార్థి ఆధార్, తల్లిదండ్రుల ఆధార్ కార్డు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే టీసీ లేదా రికార్డ్ షీట్ ద్వారా అడ్మిషన్ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి. అమృత, ఎస్‌కే బేగం పాల్గొన్నారు .

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ముందస్తు చర్యల్లో భాగంగా టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పూల్‌బాగ్, ఖాదర్ నగర్, బాబామెట్ట, దాసన్నపేట ప్రాంతాల్లో పోలీసులు శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. టూటౌన్ సీఐ కె.రామారావు, ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో సివిల్, కేంద్ర బలగాలు సంయుక్తంగా కవాతు నిర్వహించి, ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు.

నిబంధనల మేరకే జాతరలు..

- తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

భోగాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల మేరకు ఉత్సవాలు జరుపుకోవాలని తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు భోగాపురం, పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో జరగబోయే కనకదుర్గ, పోలిపల్లి అమ్మవార్ల జాతరలకు సంబంధించి ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మోడల్ ఆఫ్ కాండాక్ట్‌ను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన గుర్తులు గాని, వ్యక్తుల ఫోటోలు, వారి పేర్లను గాని ఎక్కడా ప్రచురించకూడదని సూచించారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ.. అశ్లీలకరమైన నృత్యాలు గాని, ఇతర అసాంఘిక కార్యకాలాపాలకు పాల్పడకూడదన్నారు. అంతేకాకుండా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ జి. చంద్రకళ, మూడు గ్రామాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

25 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


శ్రీదేవి,భూదేవి సహిత శ్రీనివాసుడు

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుని వార్షిక బ్రహ్మోత్సలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు తెలిపారు. డెంకాడ, గుణుపూరు గ్రామాల సరిహద్దులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 26న కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం, 27న సుదర్శన హోమం, పండిత సదస్యం, 28న చక్రస్నానం, తదితర కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న కంటి వైద్య నిపుణులు

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు గ్రామ సచివాలయం ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయనగరంలోని వెంకటరామా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో బి.రాజేరు గ్రామంతో పాటు చిన్నతామారాపల్లి, జి.పి.అగ్రహారం గ్రామాలకు చెందిన రోగులు పాల్గొన్నారు. కంటి వైద్య నిపుణులు రామునాయుడు వైద్య పరీక్షలను నిర్వహించారు. 14 మంది రోగులకు కంటి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మెరకముడిదాం: మండలంలోని 17 సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం.పావని శుక్రవారం హెచ్చరించారు. కొంతమంది సిబ్బంది ఉదయం విధులకు హాజరై మధ్యాహ్నం ఫీల్డ్ విజిట్‌కు వెళ్లినట్టు చెప్పి ప్రజలకు అందుబాటులో వుండకుండా వెళ్లిపోతున్నారన్న ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇకపై ఇలా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు

- మెడికల్ ఆఫీసర్ శిరీష


రక్తదాతలను సత్కరిస్తున ఎస్ఎఫ్ఐ, రోటరీ క్లబ్ ప్రతినిధులు

విజయనగరం పూల్‌బాగ్ : రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శిరీష అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ విజయనగరం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో స్థానిక తోటపాలెంలో గల డిగ్రీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ శిరీష, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాలాజీ మాట్లాడుతూ, ప్రతి ఆరు నెలలకోసారి రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. రాము, సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ.. దేశం కోసం 23 ఏళ్ల చిన్న వయసులో ప్రాణత్యాగం చేసిన వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లని.. అటువంటి మహాత్ముల దారిలో నడిచే ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ పోరాటాలు చేస్తూనే ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నంనాయుడు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు రవికుమార్, హర్ష, వెంకీ, రమేష్, రాజు, శివ, సోమేష్, సతీష్, రోటరీ బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు ఉమాబాలాజీ, నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చింతలవలసలో అన్నదానం


ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్దనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు స్వయంగా భక్తులకు ప్రసాదం వడ్డించారు. వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యాగశాల పూజలు, మహాశాంతి హోమాలు, పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణం, రుత్విక్ సన్మానం, తదితర కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, అయినాడ వైఎస్సార్‌సీపీ నాయకుడు మామిడి శివరామకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.


స్వామికి చక్రస్నానం చేయిస్తున్న రుత్విక్కులు

ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలి


మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీకుమార్

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు వెంటనే విధుల్లో చేరాలని డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్ కోరారు. ఉద్యోగులు, కార్మికులు చేపడుతున్న సమ్మె విరుద్ధమని కార్మికశాఖాధికారులు స్పష్టం చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమార్ మాట్లాడుతూ, ప్రజా సేవల విభాగానికి సంబంధించిన సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు నోటీసు ఇవ్వకుండా సమ్మెకు దిగడం చట్టవిరుద్ధమని జేసీఎల్ తేల్చిందని చెప్పారు. పారిశ్రామిక వివాదాల చట్టం-1947 ప్రకారం మిమ్స్ యూనియన్ చేపడుతున్న సమ్మె కూడా అదే కోవలోకి వస్తుందని.. వెంటనే ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో చేరాలని కోరారు. సమావేశంలో ఏఓ గణేష్ పాల్గొన్నారు.

ప్రచారాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

చీపురుపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాల్సిందేనని చీపురుపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ బి.శాంతి చెప్పారు. ఎన్నికల నియమావళి, కోడ్ అమలు తదితర అంశాలపై రాజకీయ పార్టీలతో పాటు నాలుగు మండలాల అధికారులతో శుక్రవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ సూచించిన నియమావళిపై పూర్తి అవగాహన కల్పించుకుని ప్రచారాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. నియోజవకర్గంలో 257 పోలింగ్ కేంద్రాలు, 160 లొకేషన్లు, 33 సెక్టార్లుగా విభజించామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి కార్యక్రమం జరిగినా సూక్ష్మ స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. నాలుగు మండలాల్లో ఉండే తహసీల్దార్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులగాను, ఎంపీడీఓలు మోడల్ కోడ్ అమలుకు సంబంధించి నోడల్ అధికారులుగాను వ్యవహరిస్తారని చెప్పారు. గరివిడిలోని ఎస్‌డిఎస్ అటానమస్ కళాశాలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగాను, ఓట్లు లెక్కింపును విజయనగరం లెండి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు.

వారం ముందే అనుమతులు

ఎన్నికల కమిన్ ఆదేశాలు మేరకు రాజకీయ పార్టీలు ప్రతీ అనుమతిని సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెద్ద ర్యాలీలు, రోడ్‌షోలకు వారం రోజులు ముందే ఎన్నికల కమిషన్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రచారం, సమావేశాలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, స్పీచ్‌లు వంటి కార్యక్రమాలకు రెండు రోజులు ముందే సువిధ పోర్టల్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదని స్పష్టం చేశారు. అంతే కాకుండా రూ.50 వేలు దాటి నగదుతో ప్రయాణిస్తే సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గంట్యాడ: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పి.నీలకంఠేశ్వర రెడ్డి, ఎస్.ఐ సురేంద్రనాయుడు శుక్రవారం పరిశీలించారు. కొండతామరపల్లి గ్రామంలోని పోలింగ్ బూత్ 185, 186, గంట్యాడ గ్రామంలోని 203, 204, 205, తాటిపూడి 174 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నిర్వాహణకు అవసరమయ్యే కనీస మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

కోడ్ అమలుపై ప్రత్యేక దృష్టి

దత్తిరాజేరు: సచివాలయాల పరిధిలో ఉన్న కార్యదర్శులు నిత్యం ఎన్నికల కోడ్ అమలుపై దృష్టి సారించాలని ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సుదర్శన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, బీఎల్వోలుతో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించి ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని కోరారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ

పూసపాటిరేగ: మండలంలోని పలు పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాస్‌కాపీయింగ్ జరగకుండా చూడాలిని సిబ్బందిని ఆదేశించారు. కోనాడ జంక్షన్ వద్ద గల ఎస్ఎఫ్ఎస్ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట చీఫ్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ


ఆలయ నిర్మాణానికి నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణ పనులకు రూ.50,001 ఆర్థిక సహకారం లభించింది. విశాఖపట్టణంకు చెందిన ఇప్పరి నర్సింగరావు, లక్ష్మి, సతీష్, స్పందన, కోరాడ కనకమ మహాలక్ష్మి, శివకుమార్ దంపతులు రూ.50,001 వితరణగా అందజేశారు. శుక్రవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్‌వి జి.శ్రీనివాసరావు, గంట్యాడ సీతరాజు, గుడ్ల శ్రీనివాస్‌లకు అందజేశారు.

వైభవంగా స్వామివారి తులాభార సేవ


ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

జామి: మండలంలో ప్రసిద్ధి చెందిన అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం రాత్రి వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి తులాభార మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ గావించారు. శుక్రవారం ఉదయం దేవతా హోమం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకుందాం


మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఈశ్వరరావు

జామి: నీటి కొరత రాకుండా నీటి వనరులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగరపు ఈశ్వరరావు అన్నారు. మండలంలోని జాగరం గ్రామంలో రైతులు, పలువురు ప్రజా ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ప్రాధాన్యత అంశాలను వివరించారు. రాబోవు రోజుల్లో నీటి కొరత రాకుండా భావితరాలను, పశు పక్ష్యాదులను కాపాడుకోవాలన్నారు. వాటి కోసం ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్య పరచడం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు, ఎంపీటీసీ పొడిపిరెడ్డి నరసింహనాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి స్నపన తిరుమంజనం


పసుపు అలంకరణలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

వేపాడ: మండల కేంద్రం వేపాడలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ మంత్రోచ్చరణాలతో స్వామి వారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ అభిసేకం, పసుపు కుంకుమలతో అలంకరణ, నక్షత్ర హారతి, పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు.